సాక్షి
సిద్దిపేట
గురువారం । 29 । జూన్ । 2023



దుక్కులు దున్ని.. విత్తనాలు విత్తి
ఇటీవల కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు పొలంబాట పట్టి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కిదున్ని విత్తనాలు వేస్తున్నారు. 8లో..



భూనిర్వాసితుల త్యాగం మరువలేనిది
కొండపోచమ్మ నిర్వాసితుల త్యాగం మరువలేనిదని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. 9లో..

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్
సిద్దిపేటకమాన్: సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, సమావేశాలు, సభలు నిర్వహించరాదని సూచించారు. సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పచ్చళ్ల రుచి విదేశీయులకు చూపించాలి



మహిళలతో మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటరూరల్: ఇర్కోడ్ గ్రామంలో స్వయం సహాయక బృందం ఆధ్వర్యంలో మహిళలు తయారు చేస్తున్న చికెన్, మటన్ చట్నీల రుచిని విదేశీయులకు చూపించాలని పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. బుధవారం గ్రామంలో వాటిని పరిశీలించి మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో మహిళలు ఇలాంటి ఫుడ్ ప్రాసెసింగ్ చేపట్టడం చాలా బాగుంది. తనకు తెలిసిన వీహబ్ అనే సంస్థ ద్వారా ఎక్కువగా మార్కెటింగ్ జరిగేలా చూస్తానన్నారు. వెజ్ చట్నీలను కూడా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ చంద్రమోహన్, డీపీఎం, ఏపీఎం విజయనిర్మల, ఉపసర్పంచ్ స్వామి, సీసీలు హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

జీపీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె నోటీసు అందిస్తున్న నాయకులు

సిద్దిపేట రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జీపీ కార్మిక సంఘం జేఏసీ జిల్లా కో కన్వీనర్ తునికి మహేశ్ అన్నారు. బుధవారం తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగుల కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నారాయణరావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో జూలై 6 నుంచి చేపట్టనున్న సమ్మె నోటీసును అందించారు. ఈ కార్యక్రమంలో బాలు, నరేష్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: తూంకుంట



కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్) : కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి డిమాండ్ చేశారు. వర్గల్ మండలం గౌరారం సత్య సూర్య పరిశ్రమ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం నియోజకవర్గంలోనే పరిశ్రమల యాజమాన్యాలు కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కార్మికుల వేతన ఒప్పందం అమలయ్యేలా ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, పరిశ్రమ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్, రవిరాజ్, అశోక్, సద్దాం, సుధాకర్, నరేష్, రాజు, జయమ్మ, ఊర్మిళ, వసంత, భాగ్యమ్మ, ఈశ్వరమ్మ, ముత్యాలు, విజయ పాల్గొన్నారు.

పథకాల అమలులో ఉద్యోగులు కీలకం



నూతన కమిటీని అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్

దుబ్బాకటౌన్ : రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని తెలంగాణ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. బుధవారం దుబ్బాక టీఎన్‌జీవోస్ నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దుబ్బాక యూనిట్ అధ్యక్షులుగా రెండోసారి రఘురామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పరమేశ్వర్, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, అశ్వక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎప్పుడిస్తరో?



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు అన్నోజు కనకాచారి, మద్దూరు మండలం లద్నూరు గ్రామం. ఇతనికున్న 8 ఎకరాల్లో యాసంగిలో వరి సాగు చేశాడు. మార్చి ఏప్రిల్ నెలలో కురిసిన వడగళ్ల వర్షానికి పంట పూర్తిగా నేలపాలైంది. దీంతో రైతుకు కనీసం పెట్టుబడి కూడా రాలేదు. వ్యవసాయ అధికారులు పంట నష్ట వివరాలను సేకరించారు. కానీ ఇంతవరకు పరిహారం అందలేదు. వానాకాలం పెట్టుబడికైనా అందుతుందని ఆశగా రైతు ఎదురు చూస్తున్నాడు. ఇది ఒక్క కనకాచారి ఎదుర్కొంటున్న సమస్య కాదు, జిల్లాలోని అనేక మంది రైతులది ఇదే పరిస్థితి.



వడగళ్ల వర్షానికి దెబ్బ తిన్న పైరు (ఫైల్)

- పంట నష్ట పరిహారం కోసం ఎదురుచూపు
- వడగళ్లు, అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- ఎకరానికి రూ.10వేల అందిస్తానన్న ప్రభుత్వం
- మొదటి విడతలో కొందరికే అందిన సాయం
- మరికొందరికి తప్పని నిరీక్షణ

సాక్షి, సిద్దిపేట : అకాల వర్షాలు, వడగళ్లతో నష్టపోయిన రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో మార్చి 16 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు కురిసిన వడగళ్లు, అకాల వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించింది. అయితే కొందరికి ఈ సాయం అందగా, మరికొందరు వాటి కోసం నిరీక్షిస్తున్నారు.

- జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 52,407 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇందులో మార్చి 16 నుంచి 20వ తేదీ వరకు 1,146.11 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, వారికి గత పదిరోజుల కిందట చెల్లించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇంకా పరిహారం చెల్లించలేదు.
- మార్చి 21 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు కురిసిన అకాల వర్షాలకు 51,261.08 ఎకరాల్లో 55వేల మంది రైతులు నష్టపోయారు. అందులో వరి 44,601.12 ఎకరాలు, మొక్కజొన్న 475.04, ఉద్యానవన పంటలు 6,158, సన్ ఫ్లవర్ 25.27, నువ్వులు 1.05 ఎకరాలు ఉన్నాయి.
- అత్యధికంగా మద్దూరులో 8,993, చేర్యాలలో 7,630 ఎకరాలు, సిద్దిపేట అర్బన్ 5,674, రూరల్‌లో 5,681, దుబ్బాకలో 4,968 ఎకరాల్లో పంటలు పాడయ్యాయి. అత్యల్పంగా దౌల్తాబాద్‌లో 50.28 ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి.
- జిల్లాలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యవసాయ, ఉద్యాన వన, రెవెన్యూ శాఖలు మండల, జిల్లా స్థాయి సర్వే బృందాలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహించారు.
- ప్రభుత్వానికి మే రెండో వారంలో కలెక్టర్ ఆమోదంతో వ్యవసాయ శాఖ నుంచి నివేదికను పంపించారు. ఇప్పటి వరకు మొదటి విడత పంపించిన పంట నష్టపరిహారం మాత్రమే రైతులకు అందింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.
- యాసంగిలో అకాల వర్షాలకు నష్టపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం పంటల సాగు ప్రారంభం కావడంతో రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైన అధికారులు స్పందించి నష్టపరిహారం త్వరగా అందించాలని కోరుతున్నారు.

12 ఎకరాల్లో నష్టం



యాసంగిలో 12 ఎకరాల్లో వరి సాగు చేశాను. పంట చేతికి వచ్చిన సమయంలో వడగళ్ల వాన పడి వడ్లు మొత్తం రాలిపోయాయి. ప్రభుత్వం చేస్తామన్న సాయం ఇప్పటివరకు అందలేదు. త్వరగా అందిస్తే వానాకాలం పెట్టుబడికి అయినా ఉపయోగపడుతుంది.
–ఉల్లంపల్లి సాయిలు, అయినాపూర్

నష్టపరిహారం వెంటనే అందించాలి



నాకున్న పొలంతో సహా 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేశాను. కోతకొచ్చే సమయంలో వడగళ్ల వాన పడి పంట పూర్తిగా కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయాను. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం త్వరగా అందించి ఆదుకోవాలి.
–గిరక శ్రీనివాస్, తాడూరు

నేడే బక్రీద్



జోరుగా పొట్టేళ్ల కొనుగోళ్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా బక్రీదు పండుగను గురువారం జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. పట్టణంలోని ఈద్గాల వద్ద నమాజ్‌లు చేసేందుకుగాను మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పండగ సందర్భంగా మాంసం పంచుకోవడం ఆనవాయితీ. అందుకు గాను బుధవారం పొట్టేళ్లను కొనుగోలు చేయడానికి ముస్లింలు తరలివచ్చారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ : మంత్రి హరీశ్‌రావు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): త్యాగానికి ప్రతీక బక్రీద్ పండగ అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ, ఈ పండుగ జరుపుకొంటారన్నారు. భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలన్నారు. అల్లా ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నారు.

పేదింటి ఆడబిడ్డల మేనమామ కేసీఆర్

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



మాట్లాడుతున్న రోజాశర్మ

తొగుట(దుబ్బాక) : పేదింటి ఆడపడుచులకు సీఎం కేసీఆర్ మేనమామలా వివాహాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా శర్మ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో లేని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను సీఎం అమలు చేస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. ఇప్పటికే వానాకాలం పంట పెట్టుబడి రైతుల ఖాతాల్లో జమచేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రైతులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాందారి లత, పీఏసీఎస్, ఏఎంసీ చైర్మన్లు హరికృష్ణారెడ్డి, కొమురయ్య, వైస్ చైర్మన్లు యాదగిరి, రాంరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ జహీర్, ఎంపీడీవో శ్రీధర్, సర్పంచ్‌లు గోవర్ధన్‌రెడ్డి, ప్రేమల, నర్సింలు, ఎంపీటీసీలు లలిత, స్వామి, నర్సింలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు అరుణ్ పాల్గొన్నారు.

బుక్ స్టాల్స్‌లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..



సిద్దిపేటలో అధికారుల వాహనాలు

సిద్దిపేట కమాన్: బుక్ స్టాల్స్‌లో కొనుగోలు చేసిన నోట్ బుక్స్, పుస్తకాలు, స్టేషనరీకి స్టాల్ నిర్వాహకులు బిల్లులు ఇవ్వకుండా తెల్ల కాగితంపై రాసిస్తున్నారని, జీఎస్టీ చెల్లించకుండా వ్యాపారం చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని 'జీరో దందా' అనే శీర్షికతో 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి వాణిజ్య పన్నుల శాఖ అధికారులు స్పందించారు. వాణిజ్య పన్నుల శాఖ నిజామాబాద్ జాయింట్ కమిషనర్ లావణ్య నేతృత్వంలో ఆరు బృందాలు సిద్దిపేటలోని బుక్ స్టాళ్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొత్తం 11 బుక్ స్టాళ్లను తనిఖీ నిర్వహించగా కేవలం ఒక దుకాణం మాత్రమే ఇన్‌వాయిస్ మెయింటెనెన్స్ చేస్తున్నట్లు గుర్తించారు. మిగతావి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం నిర్వహిస్తుండడంతో ఒక్కో బుక్ స్టాల్‌కు రూ.20వేల చొప్పున జరిమానా విధించారు.

చేర్యాల అస్థిత్వాన్ని దెబ్బతీశారు

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల నియోజకవర్గ అస్థిత్వాన్ని దెబ్బతీసింది మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అని, అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటని మల్లన్న ఆలయ చైర్మన్ గీస భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరుగా ఎదుర్కోలేక ఎమ్మెల్యే కుటుంబంలో చిచ్చుపెట్టి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని విమర్శించారు. స్వామి, కరుణాకర్, కిషన్, రమేష్, నరేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గీస భిక్షపతి

దశాబ్దమైనా పూర్తి కాని ప్రాజెక్టులు



మాట్లాడుతున్న ప్రభాకర్

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: దశాబ్ద కాలంలో సీఎం ప్రాజెక్టులు పూర్తి చేయలేకపోయారని, గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల వద్ద కుర్చీ వేసుకొని మరి నిర్మాణం పూర్తి చేస్తానన్న సీఎం కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. గౌరవెల్లి ప్రాజెక్టును నీటితో నింపితే ఏం లాభమని, కాలువల నిర్మాణం చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాలువల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో కంటే తెలంగాణలోనే ఎక్కువ అభివృద్ధి జరిగిందని మంత్రి కేటీఆర్ అనడం హాస్యాస్పదం అన్నారు. ఎంపీ వినోద్‌కుమార్ హుస్నాబాద్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. హుస్నాబాద్ ఆడిటోరియంకు రూ.4కోట్లు, ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేస్తానన్న మంత్రి హరీశ్‌రావు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. సమావేశంలో టీ పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బంక చందు, జంగపల్లి అయిలయ్య, తిరుపతి రెడ్డి, చిత్తారి పద్మ, వల్లపు రాజు, యాదవరెడ్డి, మైదంశెట్టి వీరన్న, కర్ర రవీందర్ రెడ్డి, రజిత, పున్న సది ఉన్నారు.

ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి

సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్



మాట్లాడుతున్న మహేందర్

సిద్దిపేటకమాన్: ప్రజలకు ఉపయోగపడే వాటిని మాత్రమే ఫేస్‌బుక్, ట్విట్టర్, సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ సూచించారు. సోషల్ మీడియా, ఫేస్‌బుక్, ట్విట్టర్‌పై పోలీసు కమిషనర్ కార్యాలయంలో టెక్ టీం సిబ్బందికి బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాపై పోలీస్‌స్టేషన్లలో నిఘా ఉంటుందని చెప్పారు. బ్లూకోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది దీనిపై యువకులకు అవగాహన కల్పించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పోలీసులు ప్రజలకు చేరువ కావాలని సూచించారు. సోషల్ మీడియా ప్రాముఖ్యతపై ఎస్‌బీ సీఐ రఘుపతిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ తిరుపతి, టెక్ టీమ్ సిబ్బంది, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నేడు గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి నీళ్లు



గౌరవెల్లి రిజర్వాయర్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మెట్టప్రాంత రైతుల కల నెరవేరబోతోంది. గౌరవెల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపుతారా లేదా అనే ప్రశ్నకు సమాధానం దొరికింది. ఈ రిజర్వాయర్‌లో డెలివరీ సిస్టం ద్వారా నీళ్లు నింపేందుకు రేగొండ పంప్‌హౌజ్ వద్ద మూడు మోటర్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ చేతుల మీదుగా ఒక పంప్ బటన్ నొక్కించేందుకు అధికారులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. మూడు, నాలుగు రోజుల పాటు రిజర్వాయర్‌లో ఒక పంప్ ద్వారా గోదావరి జలాలతో కొంతమేర నీళ్లు నింపనున్నారు. సీఎం కేసీఆర్ ప్రారంభోత్సవానికి వచ్చే నాటికి రిజర్వాయర్‌లో దాదాపు ఒకటిన్నర టీఎంసీల నుంచి రెండు టీఎంసీల వరకు నీళ్లు ఉండేలా చూస్తున్నట్లు అధికారుల వర్గాల ద్వారా తెలిసింది. కాగా ఎడమ కాలువ తూము షట్టర్ బిగింపు పనులు పూర్తి కాగా, కుడి కాలువ పనులు కూడా తుదిదశకు చేరుకున్నాయి.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

- ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి 'సాక్షి'తో డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్



సిద్దిపేట కమాన్ : వర్షాకాలంలో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలిచి ఉంటే దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు.

- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చేపట్టాల్సిన చర్యల గురించి రివ్యూ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటాం.
- ఇళ్లలో కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఇతర వినియోగంలో లేని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమ తెరలు వాడాలి. మధ్యాహ్నం సమయంలో దోమలు కుట్టకుండా చూసుకోవాలి.
- జిల్లా ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి. కార్యక్రమంలో ఆశాలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుంటూ ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధుల అవగాహన కల్పించనున్నారు.
- సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణ కోసం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా ఎపిడెమిక్ సెల్ ఏర్పాటు చేస్తాం. సలహాలు, సందేహాలు, ఉంటే ఫోన్ నెంబర్ 6303696647లో సంప్రదించాలి.
- పీహెచ్‌సీ స్థాయిలో ఎవరైనా ఫీవర్ బారిన పడితే వారి నుంచి బ్లడ్ శాంపిల్ సేకరించి పరీక్షించి వారికి అవసరమైన మందులు అందిస్తాం. మలేరియా, డెంగీ అనుమానిత లక్షణాలు ఉంటే వారి నుంచి బ్లడ్ శాంపిల్ సేకరించి జిల్లా కేంద్రంలోని టీ హబ్‌లో పరీక్షిస్తాం. పాజిటివ్‌గా నిర్ధారణ జరిగితే సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తాం. డెంగీ బారిన పడిన వారి ఇంటి చుట్టు పక్కల ఉన్న 50 ఇళ్లను సందర్శించి వారిని పరీక్షిస్తాం. వారి ఇంటి చుట్టు పక్కల దోమల నివారణ మందును స్ప్రే చేయిస్తాం.
- సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ స్థాయిలో మూడు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశాం. ఒక్కో టీంలో నలుగురు వైద్య సిబ్బంది సీహెచ్‌ఓ, హెల్త్ ఎడ్యుకేటర్, హెల్త్ అసిస్టెంట్, వైద్య సిబ్బంది ఉంటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ఒక మెడికల్ ఆఫీసర్, హెల్త్ సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్ ఉండి విధులు నిర్వహిస్తారు. ఎమెర్జెన్సీ డ్రగ్ కిట్‌తో అవసరమైన వారికి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించి అనుమానం ఉంటే సంబంధిత పీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రి, సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించడానికి ఏర్పాట్లు చేశారు.
- జిల్లాలో గతేడాది 161 మంది డెంగీ, ఒకరు మలేరియా, ఒకరు చికెన్‌గున్యా, 672 మంది వైరల్ ఫీవర్ బారిన పడ్డారు. గతేడాది డెంగీ కేసులు ఎక్కువగా నమోదైన ప్రాంతాలను హైరిస్క్ ఏరియాలుగా గుర్తించి ఆ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 8 డెంగీ కేసులు నమోదు కావడంతోపాటు 82 మంది వైరల్ ఫీవర్ బారిన పడ్డారు.
- పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో శానిటేషన్ పనులు, పరిశుభ్రత, ఇతర ఆరోగ్య పరమైన అంశాలపై అవగాహన కల్పిస్తాం.
- ఆరోగ్య సలహాలు, సూచనలు ఇస్తాం. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో పోస్టర్ల ఏర్పాటు, లౌడ్ స్పీకర్ల ద్వారా అవగాహన కల్పిస్తాం.
- వర్షాకాలంలో రోడ్డు పక్కన ఆహార పదార్థాలు, చిరుతిళ్లు తినకూడదని సూచించారు. ఇంటిలో తయారు చేసిన వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. వర్షాకాలంలో మాంసాహారానికి దూరంగా ఉండాలి. కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలి.

క్లుప్తంగా

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

కొండాపూర్(సంగారెడ్డి): నాగర్ కర్నూలు, నిజామాబాద్ జిల్లాలలో ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్ కర్నూలు, నిజామాబాద్ జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాల ధర్నాకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను పోలీసులు మధ్యలో అడ్డగించి, అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బిల్ కలెక్టర్‌పై ఫిర్యాదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మేజర్ గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ గత నెల నుంచి రావడం లేదని గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది ఫిర్యాదు మేరకు బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ పంచాయతీ రికార్డును తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం బిల్ కలెక్టర్ రావడం లేదని నిర్ధారణకు రావడంతో ఆయనకు నోటీస్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రికార్డులను తనిఖీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతో పాటు రాజీవ్ రహదారిపై సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించగా 6గురు మద్యం తాగి వాహనాలు నడుపుతు పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన ద్వితీయశ్రేణి న్యాయమూర్తి రమేశ్‌బాబు వారికి రూ.14,500 జరిమానా విధించింది. వారిలో ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

బెజ్జంకి(సిద్దిపేట): అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని బెజ్జంకి ఎస్ఐ ప్రవీణ్‌రాజ్ హెచ్చరించారు. మండలంలోని గాగిల్లాపూర్ శివారులో బుధవారం బెజ్జంకి తహసీల్దార్ విజయ ప్రకాష్‌రావు ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీ చేశారు. అక్రమంగా నిలువ ఉంచిన మూడు ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో రెవెన్యు పరిశీలకులు రాజయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకోండి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారంలో భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కుతీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆరోపిస్తు బీజేపీ నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సాయికిరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్‌లు మాట్లాడారు. బొల్లారంలో భారీవాహనాలు పట్టణం నుంచి కాకుండా ఇతర రహదారులగుండా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, ఆనంద్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అస్వస్థతతో యువకుడి మృతి

చిన్నశంకరంపేట(మెదక్): గవ్వలపల్లి గ్రామానికి చెందిన టీఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి లచ్చిగల్ల దేవయ్య కుమారుడు లచ్చిగల్ల సాయిబాబా అస్వస్థతతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం స్వల్ప జ్వరంతో బాధపడుతూ మెదక్ ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ తీవ్రమైన జ్వరంతో అస్వస్థతకు గురై మృతి చెందాడు.



మాచాపూర్‌లో దుక్కిదున్నుతున్న రైతు



విఠలాపూర్‌లో విత్తనాలు వేస్తున్న రైతులు

దుక్కి దున్ని.. విత్తనాలు విత్తి..

ఇటీవల కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు పొలంబాట పట్టారు. పనుల్లో బిజీబిజీ అయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కి దున్ని విత్తనాలు వేస్తున్నారు. ఏ పొలంలో చూసినా రైతులు, కూలీల సందడే కనిపిస్తోంది. మొక్కజొన్న, పత్తి విత్తనాలు వేస్తుండగా, కొందరు రైతులు ఎరువులు చల్లుతున్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని మాచాపూర్, విఠలాపూర్ గ్రామాల్లో పొలం పనుల్లో ఉండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

–సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు




ఎరువు చల్లుతున్న రైతులు

కారుమబ్బులు కమ్మేశాయి..

వాతావరణంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. అవి చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇది వాతావరణంలో వచ్చిన మార్పులకు అద్దం పడుతుంది. ఈ చిత్రాలు..కొన్ని క్షణల్లోనే మోడువారి చెట్టును..తలపించి ఆకాశంలో కారుమబ్బు చేస్తున్న అద్భుత దృశ్యాలు చిన్నకోడూరు మండల పరిధిలోని విఠలాపూర్ గ్రామశివారులో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

–సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



రుద్రారంలో కార్డన్ సెర్చ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

- 48 ద్విచక్ర వాహనాలు సీజ్
- తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలను చైతన్య పరిచేందుకే పోలీస్ కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండలం రుద్రారంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు, చలాన్లు పెండింగ్‌లోఉన్న 48 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి వాహనాలను వాటి పత్రాలను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ యాదగిరిరెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలను అప్రమత్తం చేసేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా గుర్తుతెలియని వ్యక్తులు తక్కువ ధరకు విక్రయించే ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయొద్దన్నారు. ప్రతీ ఒక్కరు వహనాల పత్రాలను కలిగి ఉండడంతో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. ఈ కార్యక్రమలో చిన్నశంకరంపేట, చేగుంట, నార్సింగి ఎస్ఐలు సుభాష్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, నర్సింహులు, రామ్‌చందర్‌నాయక్, సర్పంచ్ లక్ష్మినారాయణ, ఉపసర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి



ప్రశాంత్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇష్టం లేని చదువు చదవలేనని తల్లిదండ్రులకు చెప్పలేక బాధపడుతూ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం గొల్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గెంటే ప్రశాంత్(23)హనుమకొండలోని శ్రీచైతన్య కాలేజీలో ఎంసీఏ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో అతనికి చదువు అంటే ఇష్టం లేక తను లోలోప మనోవేదనానికి గురవుతూ ఈ నెల 20వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా వ్యవసాయ క్షేత్రంలో ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. పురుగుల మందు తాగినట్లు ఫోన్‌లో తన బావ సురేష్‌కు విషయమంతా చెప్పాడు. దీంతో హుటాహుటిన ములకనూర్‌లోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. తల్లి గంటే లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్..



బాబు (ఫైల్)

గజ్వేల్‌రూరల్: గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూనియర్ అసిస్టెంట్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు చెందిన సంగెం బాబు వీఆర్వోగా విధులు నిర్వహించేవాడు. ప్రభుత్వం వీఆర్వోల వ్యవస్థను రద్దు చేయడంతో గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా గతేడాది ఆగస్టులో విధుల్లో చేరాడు. బాబు రెండ్రోజుల క్రితం గుండెపోటుకు గురవడంతో కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ మరోసారి గుండెపోటు రావడంతో బుధవారం మృతి చెందాడు. గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపక బృందం సంతాపం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



అస్పాక్(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): బతుకు దెరువు కోసం వచ్చిన జేసీబీ క్లీనర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా కైత్వార్ గ్రామానికి చెందిన అస్పాక్ (17) వట్‌పల్లికి చెందిన కలాలి యాదగిరి గౌడ్ దగ్గర జేసీబీ క్లీనర్‌గా గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి పనిని ముగించుకుని వెంకటభాజా దర్గాకు సంబంధించిన గదిలో పడుకున్నాడు. బుధవారం ఉదయం యజమాని గది లోపలికి వెళ్లి చూడగా అస్పాక్ విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో అతను పోలీసులకు, మృతుని తల్లిదండ్రులకు సమాచారం చేరవేశాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుప్రతికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యజమానితో గొడవ..

అదే రాత్రి డబ్బుల విషయంలో యజమానితో గొడవ జరిగిందని అస్పాక్ తమకు ఫోన్ చేశాడని జేసీబీ డ్రైవర్లు పేర్కొన్నారు. మరుసటి రోజే మృతి చెందడంపై తమకు అనుమానం ఉందని వారు ఆరోపించారు. మృతుని సెల్‌ఫోన్ కనిపించడం లేదని, ఫోన్‌చేస్తే స్విచాఫ్ వస్తుందన్నారు. ఫోన్‌లో ఏమైన ఆధారాలు ఉంటాయని పోలీసులతో డ్రైవర్లు చెబుతున్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ నరేష్...



నరేష్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: బ్రెయిన్ స్ట్రోక్‌తో దాచారం గ్రామానికి చెందిన ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఏలేశ్వరం నరేష్(32) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన నరేష్ తనకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్‌గా అతను బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి స్వల్ప అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి బుధవారం దాచారంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోహీర్(జహీరాబాద్): బావిలో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం..మృతుడు కమ్మరి గోవింద్(25) గ్రామం పక్కనే డేరా వేసుకొని కమ్మరి పని చేసుకొని జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి భార్యాభర్తలు గొడవ పడ్డారు. గోవింద్ తాగిన మైకంలో పక్కనే ఉన్న కొత్త బావిలో దూకాడు. భార్య లక్ష్మి అరుపులకు గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకొని గోవిందును రక్షించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. బావి లోతుగా ఉండడంతో బుధవారం మధ్యాహ్నం అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పాఠ్యపుస్తకాల అక్రమ అమ్మకాలు



పాఠ్యపుస్తకాలు అక్రమ అమ్మకాలు నిర్వహిస్తున్న బుక్‌స్టాల్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుక్ స్టాల్ సీజ్

తూప్రాన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం అక్రమంగా పాఠ్యపుస్తకాలు విక్రయించడాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ బుచ్చానాయక్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ పాఠ్యపుస్తకాలు కలిగిన గదిని సీజ్ చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.3 వేల నుంచి రూ.6వేల వరకు వసూలు చేస్తున్న ప్రైవేటుస్కూల్ యాజమాన్యం జిల్లా అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఎంఈఓ ఆఫీస్ నుంచి మండల వ్యాప్తంగా నోటీసులు జారీ చేసి వారం రోజులు గడుస్తున్నా యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేదు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలల్లో ఫీజులు దోచుకుంటున్న యాజమాన్యంపై చర్యలు తీసుకొని పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

సీఐ నయీముద్దీన్

జిన్నారం(పటన్‌చెరు): శాంతి భద్రతలను పరిరక్షించేలా చర్యలు చేపడుతామని, ప్రజల సహకారంతో నేరాల సంఖ్యను తగ్గిస్తామని బొల్లారం సీఐ నయీముద్దీన్ అన్నారు. బుధవారం జిన్నారం మండలంలోని బొల్లారంలో సీఐ మాట్లాడారు. బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లిలు పారిశ్రామిక ప్రాంతాలు కావడంతో అక్కడ తగిన బందోబస్తును ఏర్పాటు చేయిస్తామన్నారు. పారిశ్రామిక వాడల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలుతీసుకుంటామన్నారు. నేరాలను తగ్గించడంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. చోరీలను పూర్తి స్థాయిలో నివారించేల చూస్తామన్నారు.

ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు

కొండపాక(గజ్వేల్): అకారణంగా సీనియర్ విద్యార్థిపై దాడి చేసిన జూనియర్ విద్యార్థులు ఎండీ ఇబాయత్, ఆదిత్యవర్ధన్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..వెలికట్ట గ్రామ శివారులోని శ్రీకృప ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటీకల్ సైన్సు కాలేజీలో చేర్యాలకు చెందిన సమీర్ ఫైనల్ ఇయర్ విద్యనభ్యసిస్తున్నాడు. అదే కాలేజీలో చదువుతున్న జూనియర్ విద్యార్థులు ఇబాయత్, ఆదిత్యవర్ధన్‌రెడ్డిలే ఓ అమ్మాయి విషయంలో మంగళవారం కాలేజీ సమీపంలో అకారణంగా దాడి చేశారు. చంపుతామంటూ బెదిరించారన్నారు. దీంతో సమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలేజీ నుంచి డీబార్ చేశాం : ప్రిన్సిపాల్ మంజునాథ్

కాలేజీ పేరు ప్రతిష్ఠలను దెబ్బతీసేలా వ్యవహరించిన ఇద్దరు విద్యార్థులు ఇబాయత్, ఆదిత్యవర్ధన్‌రెడ్డిలను కాలేజీ నుంచి సస్పెండ్‌చేశామని ప్రిన్సిపాల్ మంజునాథ్ తెలిపారు.

పరిశ్రమ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు

చిన్నశంకరంపేట(మెదక్): చందంపేట-రుద్రారం పెద్ద చెరువులో వ్యర్థాలను వదులుతున్నారని ఓ పరిశ్రమపై రుద్రారం సర్పంచ్ మంచాల లక్ష్మణ్, గ్రామస్తులు చిన్నశంకరంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టీల్ అండ్ ఐరన్ పరిశ్రమలోని వ్యర్థపదార్థాలను సంచుల్లో నింపి చెరువులో వదులుతున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఇందులో దుర్వాసనతో కూడిన వ్యర్థాలు ఐరన్ పౌడర్ ఉందని వెంటనే కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై విచారించి చర్యలు చేపట్టాలని డీఎస్పీ యాదగిరిరెడ్డి చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్‌ను ఆదేశించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

సిద్దిపేటరూరల్: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకునాన్నాడు. మృతుని భార్య రమ్య తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వసూరి రాజు(30) గత కొంతకాలంగా తనకున్న 35 గుంటల భూమిని సాగుచేస్తున్నాడు. పెట్టుబడుల కోసం పలు చోట్ల అప్పులు చేశాడు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతింది. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక కొంతకాలంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం బావి వద్దకు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి వెళ్లాడు. భర్త రాజు ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. మృతుని తండ్రి నారాయణ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా అక్కడ చెట్టుకు ఉరివేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

బ్యాంక్ ఖాతా వెరిఫికేషన్ పేరుతో సైబర్ మోసం



సిద్దిపేటకమాన్: బ్యాంక్ ఖాతా వెరిఫికేషన్ పేరుతో ఫోన్ కాల్‌కు స్పందించి మోసపోయిన సంఘటన సిద్దిపేట పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి యాక్సిక్ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నానంటూ ఫోన్ వచ్చింది. బ్యాంక్ ఖాతా (బ్యాంక్ అకౌంట్) వెరిఫికేషన్ చేస్తున్నామని గుర్తు తెలియని వ్యక్తి నమ్మబలికాడు. ఫోన్‌కు వచ్చిన లింకుకు స్పందించాడు. ఆ లింకులో తన వివరాలు నమోదు చేయాలని 24 గంటల్లో యాక్టివేట్ అవుతుందని సూచించాడు. అది నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన విధంగా చేశాడు. దీంతో కార్డు వివరాలు చెప్పడంతో పాటు సివివి నెంబర్ నమోదు చేశాడు. తన ఖాతా నుంచి రూ.38,757 డెబిట్ అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అనుమానం వచ్చిన బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

శివ్వంపేటలో ఇరువర్గాల ఘర్షణ

డీఎల్‌పీఓ ముందు తోపులాట



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో అధికార పార్టికి చెందిన ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..శివ్వంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని గ్రామ పంచాయతీ ఆక్రమించుకుని పలు నిర్మాణాలు చేపట్టిందని మాజీ సర్పంచ్ భర్త నవీన్‌కుమార్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ భర్త జంగం వెంకటేష్ వర్గీయులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు చేశారు.

విచారణ అధికారి ముందు..

ఈ విషయంలో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాల్సిందిగా డీఎల్‌పీఓ యాదయ్యకు కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో డీఎల్‌పీఓ బుధవారం శివ్వంపేటలో విచారణకు వచ్చారు. డీఎల్‌పీఓ ముందు మాజీ సర్పంచ్ భర్త నవీన్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ వర్గీయులు గొడవకు దిగారు. ఒకరినొకరు దూషించుకుంటూ, బూతు మాటలతో తోపులా డుకున్నారు. ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు.

కలెక్టర్‌కు నివేదిస్తా : డీఎల్‌పీఓ

పీహెచ్‌సీ స్థలంలోని పలు కట్టడాలు తొలగించిన విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు నేపథ్యంలో విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీఓ యాదయ్య చెప్పారు. ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు, సర్పంచ్, మాజీ సర్పంచ్ ద్వారా సేకరించిన వివరాలు కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి.. పలువురికి గాయాలు

వేర్వేరు సంఘటనల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ములుగు, మనోహరబాద్ ప్రాంతాల్లో పలువురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

ఇసుకలారీ ఢీకొని వ్యక్తి..

పాపన్నపేట(మెదక్): ఇసుకలారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నార్సింగి శివారు దారిదేవుని ఆలయ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గుర్తు తెలియని వ్యక్తి (60) సైకిల్‌పై పాపన్నపేట నుంచి నార్సింగి వైపుకు వెళ్తుండగా ఆవైపుగానే వేగంగా వస్తున్న ఇసుకలారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూజారి ...



రాజేశ్వర్ మృతదేహం

రామాయంపేట(మెదక్): లక్ష్మాపూర్ గ్రామశివారులో మంగళవారం రాత్రి లారీ, కారు ఢీకొన్న సంఘటనలో పూజారి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..హవేళి ఘన్‌పూర్ మండలం శమ్నాపూర్‌కు చెందిన జంగం రాజేశ్వర్(48) రాజరాజేశ్వర ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. అతను మరో ఇద్దరితో కలిసి కారులో రామాయంపేటవైపు వస్తుండగా, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజేశ్వర్‌ను 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని పేర్కొన్నారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుని భార్య ఫిర్యాదుమేరకు ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాజీవ్‌రహదారిపై..

ములుగు(గజ్వేల్): ములుగు శివారులోగల హవేలీ ఫామ్ ఎదురుగా రాజీవ్‌రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణీకులకు స్వల్ప గాయాలయినట్లు ఎస్ఐ రంగ కృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..హైదరాబాద్ నుంచి గజ్వేల్‌వైపు వస్తున్న గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో బస్సు ములుగు శివారులోకి చేరుకోగానే ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బస్సు ముందు సీటులో కూర్చున్న ప్రయాణీకులు సుభాష్‌గాంధీ, కవిత, లావణ్య మరికొందరితో పాటు డీసీఎం వాహనంలో ప్రయాణిస్తున్న అన్వర్, చాంద్‌పాష, కృష్ణలకు గాయలయ్యాయి. వారిని లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం, గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఆర్టీసీ బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ రాధాకృష్ణపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన అవుసుల శ్రీధరాచారి జాతీయ రహదారి–44పై రోడ్డు దాటుతుండగా మేడ్చల్ వైపు నుంచి నిజామాబాద్‌కు వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుణ్ని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న తహసీల్దార్ లక్ష్మినారాయణ

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మినారాయణ, మల్లన్న ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, జెడ్పీటీసీ సిద్దప్పలతో కలసి వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, గురువన్నపేట ఎంపీటీసీ సాయిమల్లు పాల్గొన్నారు.

ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

నంగునూరు(సిద్దిపేట): ఇంజినీరింగ్ ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఎంసెట్ కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు 429మంది హాజరుకాగా అధికారులు ఐడీ, పాస్‌వర్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు ముందుగా ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సారంగపాణి, నితిన్‌పవార్, శ్రీనివాస్, విజయకుమార్, శ్రీనివాస్, కవిత, జ్యోతి, రాజమౌళి పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాలతో ఆత్మగౌరవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కమ్యూనిటీ భవనాలు ఆయా కుల సభ్యులకు ఆత్మగౌరవంగా ఉంటాయని సిద్దిపేట జిల్లా కురుమ సంఘం యువజన అధ్యక్షుడు కోటగిరి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న కురుమ సంఘ భవన నిర్మాణ పనులను బుధవారం పట్టణ కుల నాయకులతో కలసి పరిశీలించారు. మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో అన్ని కులాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మించడం గొప్ప విషయమన్నారు. భవన నిర్మాణం సకల హంగులతో రెండు నెలల్లో పూర్తి కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాయుడు, తిరుపతి, నర్సింలు, సంపత్, సతీశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో కన్నారం గ్రామం విలీనం

ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోకి వేలేరు మండలంలోని కన్నారం గ్రామాన్ని విలీనం చేసేందుకు బుధవారం ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిపై 15 రోజుల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని పేర్కొంది. కాగా అక్కన్నపేట మండలానికి సమీప దూరంలో కన్నారం గ్రామం ఉంటుంది. గతంలో గ్రామాన్ని అక్కన్నపేటలో కలపాలని ఆందోళనలు, వినతిపత్రాలు సమర్పించారు. అక్కన్నపేట మండలంలో 32 గ్రామాలు ఉంటాయి. కన్నారం గ్రామాన్ని అక్కన్నపేట మండలంలో విలీనం చేసేందుకు కృషి చేసిన మంత్రి కేటీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావులకు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.


ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని వ్యవసాయ విస్తరణాధికారి శ్రీలత అన్నారు. మండలంలోని జనగామ గ్రామంలో రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ పంటలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ఉపయోగించుకొని రైతులు ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్ పామ్‌ను సాగుచేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతీ రైతు వినియోగించుకోవాలని, ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ముందుకు రావాలన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని మోహినిపూర వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను బుధవారం ఉమాపార్థీవ కోటిలింగేశ్వర స్వామి ఆలయ ఈవో రవికుమార్, వేంకటేశ్వర ఆలయ ఈవో విశ్వనాథశర్మల ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. జనవరి 30 నుంచి జూలై 28 వరకు భక్తులు స్వామివారికి సమర్పించిన కట్న కానుకలను వికాస్ తరంగిణి సభ్యులు, సంతోషిమాత సేవా సభ్యులు, గణేష్‌నగర్ సేవాసమితి సభ్యులు, లెక్కించారు. హుండీ ఆదాయం రూ.9,79,345లుగా అధికారులు ప్రకటించారు.

కొండపాకలో చారిత్రక సరస్వతి శిల్పం



కొండపాక(గజ్వేల్): కొండపాక మండల కేంద్రంలో పూర్వ యుగం నాటి సరస్వతి శిల్పాన్ని గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధక సభ్యులు అహోబిలం, కొలిపాక శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సరస్వతి శిల్పాన్ని శ్రుతదేవిగా పిలుస్తారని చెప్పారు. ఈ శిల్పం బాసరలో లభించిన జైన సరస్వతిని పోలి ఉందన్నారు. కార్యక్రమంలో పరిశోధన బృందం సభ్యులు కరుణాకర్, ఎండీ నసీర్, మహేశ్ పాల్గొన్నారు.

భూనిర్వాసితుల త్యాగం మరువలేనిది

- మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్
- డబుల్ ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పంపిణీ



డాక్యుమెంట్స్ పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ములుగు(గజ్వేల్): కొండపోచమ్మ నిర్వాసితుల త్యాగం మరువలేనిదని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని మామిడ్యాల, బహిలంపూర్ ఆర్అండ్ఆర్ కాలనీలకు చెందిన వెయ్యి మందికి ములుగు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి బుధవారం డబుల్ బెడ్రూం, ఇంటి స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టులు సాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నాయని, పచ్చని పంటలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు లింగారెడ్డి, హరిబాబు, నాయకులు అంజన్‌గౌడ్, అయిలేష్ యాదవ్, సత్తయ్య, శ్రీధర్‌రెడ్డి, వీరేశంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయడం నేరం

మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్



వ్యాపార సంస్థలో లైసెన్సుపై ఆరా తీస్తున్న కమిషనర్

చేర్యాల(సిద్దిపేట): మున్సిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యాపారం చేయడం చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిశెట్టి రాజేంద్రకుమార్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని పలు వ్యాపార సంస్థలను సందర్శించిన కమిషనర్ ఆయా సంస్థల ట్రేడ్ లైసెన్స్‌లపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ట్రేడ్ లైసెన్స్ పొందకుండా, పొందిన లైసెన్స్ రెన్యూవల్ చేయకుండా వ్యాపారం నిర్వహించొద్దన్నారు. గతంలో లైసెన్సులు పొందిన వారు జూన్ 30వ తేదీలోపు 25శాతం అపరాద రుసుము చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు అసలు ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న వారు వెంటనే సంబంధిత ధ్రువ పత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని తగు లైసెన్స్ ఫీజు చెల్లించి ట్రేడ్ లైసెన్సు పొందాలన్నారు. లైసెన్సు లేకుండా వ్యాపారం నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛ సిద్దిపేటకు అడుగులు



ఇందిరమ్మ కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిద్దిపేటజోన్: ఇంటింటికీ బల్దియా పాలకవర్గం, అధికార యంత్రాంగం వెళ్లి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి, స్వచ్ఛ సిద్దిపేటకు అడుగు వేద్దామని మున్సిపల్ కమిషనర్ సంపత్, మాజీ చైర్మన్ రాజనర్సు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి రోజు పట్టణంలోని ఒక వార్డులో శ్రమదానం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ శాంతి వార్డులో స్వచ్ఛ సిద్దిపేటపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు విజయేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మల్లికార్జున్, బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మోహిజ్, రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సతీష్, వనిత తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా పరిశీలన

సిద్దిపేటకమాన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపల్లి బస్తీ దవాఖానాను మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు బుధవారం పరిశీలించారు. బస్తీ దవాఖానాలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున్, మున్సిపల్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత పాల్గొన్నారు.

దుబ్బాక అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దుబ్బాక నియోజకవర్గాన్ని గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో 88వ రోజు హాథ్ సే హాథ్ జోడోయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దొంగ హామీలతో ఉపఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన రఘునందన్‌రావు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమి లేదన్నారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధి పనులకు కొబ్బరికాయలు కొట్టడం తప్పా చేసేందేమి లేదని ఆరోపించారు. 9 సంవత్సరాల కాలంలో ధర్మాజీపేటలో అభివృద్ధి శూన్యంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, ఆకుల భరత్, రాజిరెడ్డి తదితరులున్నారు.

మంత్రికి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ములుగు(గజ్వేల్): మండలంలోని బండమైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన బద్రీనాథ్ ఆలయ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ సర్పంచ్ అనితకృష్ణగౌడ్, ఉపసర్పంచ్ శంకరప్ప, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషాతో పాటు నాయకులు మంత్రికి ఆహ్వానం అందజేశారు.

ఆదర్శప్రాయుడు పీవీ నర్సింహారావు



హుస్నాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజం వేసిన దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు ఆదర్శప్రాయుడని ఎంపీపీ దాసరి అమరావతిశ్యామ్‌మనోహర్ పేర్కొన్నారు. పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా బుధవారం మండల పరిధిలోని రిమ్మనగూడ శివారులోగల సురభిదయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్: దేశం క్లిష్ట సమయంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని కాపాడిన గొప్ప నాయకుడు పీవీ నర్సింహారావు అని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కొనియాడారు. పట్టణంలో బుధవారం అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు ఉన్నారు.

రామకోటి రామరాజు సేవలు అభినందనీయం



విష్ణు భగవానుడి చిత్రాన్ని తిలకిస్తున్న ఏసీపీ రమేశ్ తదితరులు

గజ్వేల్‌రూరల్: రామకోటి భక్తసమాజం ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గజ్వేల్ ఏసీపీ రమేశ్ పేర్కొన్నారు. తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని పట్టణంలోని ప్రగతి స్కూల్‌లో రామకోటి రామరాజు ఆవాలతో రూపొందించిన విష్ణు భగవాన్ చిత్రాన్ని బుధవారం తిలకించారు.

సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్తాం

భూనిర్వాసితుల పోరాటానికి కాంగ్రెస్ మద్దతు



మాట్లాడుతున్న శివసేనరెడ్డి

వర్గల్(గజ్వేల్): భూనిర్వాసితుల సమస్యను జాతీయ నాయకులకు వివరిస్తామని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డితో కలిసి ఆయన వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో భూనిర్వాసితుల దీక్ష శిబిరాన్ని సందర్శించారు. దీక్ష ఆరోరోజుకు చేరుకోగా రైతుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గంలోనే భూ నిర్వాసిత రైతులకు న్యాయపరంగా పరిహారం చెల్లించకుంటే మిగతా ప్రాంతాల్లో ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మార్కెట్ ధర ఎకరానికి రూ.కోటి, కోటిన్నర పలుకుతుండగా కేవలం తొమ్మిది, తొమ్మిదిన్నర లక్షల పరిహారం చెల్లించడం సరికాదన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని వచ్చే నెల 5న యూత్ కాంగ్రెస్ సమరభేరి బస్సుయాత్రలో పాల్గొనే జాతీయ నాయకులకు వివరిస్తామన్నారు. అవకాశముంటే వారిని ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానని శిబిరంలో రైతులకు హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలోని ఈ దీక్షలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, భూనిర్వాసితులు పాల్గొన్నారు. ఉదయం శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు.

‘కుటుంబ గొడవలు సృష్టించడం సరికాదు’



మాట్లాడుతున్న మద్దూరు ఎంపీపీ కృష్ణారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): ప్రశాంతంగా ఉన్న కుటుంబంలో గొడవలు సృష్టించడం సరికాదని, మాజీ ఎమ్మెల్యేగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఇలాంటి చిల్లర పనులు చేయడం తగదని మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పూటకో పార్టీ మార్చే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, నిత్యం ప్రజాక్షేత్రంలో ఉన్న ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో తనకంటూ ఎలాంటి గుర్తింపు లేని వ్యక్తి కొమ్మూరి అని, సొంత పార్టీ కార్యకర్తలే అతనిపై దాడి చేసిన సిగ్గులేదని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రతాప్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై విమర్శలు ఇప్పటికైనా మానుకోవాలని, లేనిపక్షంలో గ్రామాల్లో తిరగనిచ్చే ప్రసక్తే ఉండదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుమలతమల్లేశం, మద్దూరు, దూళ్మిట్ట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, యాదగిరి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, సుదర్శన్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, కృష్ణవేణి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీటీసీ సమ్మయ్య, మండల ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సిద్దిపేటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సంపత్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ పట్టణానికి ప్రజలు సహకరించాలని సూచించారు. అంతకుముందు మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత పట్టణంలోని పలు వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా 23వ వార్డులో ఆదిత్య ఆస్పత్రి, బుక్‌స్టాల్, బిర్యానీ సెంటర్, మొబైల్ షాపులకు రూ.3000 జరిమానా విధించారు.

‘ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కొమ్మూరికి లేదు’



మాట్లాడుతున్న ఎంపీపీ కరుణాకర్, ఏఎంసీ చైర్మన్ మల్లేశంగౌడ్

చేర్యాల(సిద్దిపేట): ఈ ప్రాంత ఓటర్లతో రెండు సార్లు ఓడించబడిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని విమర్శించే స్థాయి లేదని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఆడబిడ్డను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడం సరికాదన్నారు. దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తావో నియోజకవర్గ ప్రజలకు చెప్పాలన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డిపై అనవసరపు ఆరోపణలు చేస్తే రానున్న రోజుల్లో ఊర్లో తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజు, కృష్ణాగౌడ్, రాములుగౌడ్, రామరాజుగౌడ్, సత్యనారాయణ, రాజేశం, ఆగమల్లు, సదానందం, ఉమామహేశ్వర్, బాశెట్టి బుచ్చిరాములు, యూత్ మండల అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, నాయకులు సాగర్, బాబు పాల్గొన్నారు.

‘ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్’

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్‌ను ప్రజలే కాకుండా పార్టీ శ్రేణులు వీడుతున్నారని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపెల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని బేగంపేటలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సోమ రాంరెడ్డి తన అనుచరులతో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి స్వాగతించిన కవ్వంపెల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రజల పోరాటాలు, యువకులు ఆత్మబలిదానాలు చేసుకోవడం చూసిన సోనియాగాంధీ వారి ఆశయాల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను కేసీఆర్ కుటుంబం అప్పుల పాలు చేసిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వారి మద్దతుతో అధికారం చేపట్టడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మైల ప్రభాకర్, జనగాం శంకర్, శానగొండ శ్రావణ్, రొడ్డ మల్లేశం, డీవీ రావు, శ్రీకాంత్, కొంకటి రాములు, పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులకు పెట్టుబడి సాయం రైతు ఖాతాల్లో జమ చేస్తున్నందున బుధవారం మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో రైతులు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొండం వనితరవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు జయవర్ధన్‌రెడ్డి, పద్మస్వామి, మధుసూదన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

ఈ హెచ్చరిక ప్రకటన ద్వారా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన పూల బాలక్రిష్ణారెడ్డి S/o నర్సింహారెడ్డి, నివాసము : ఎల్లుపల్లి గ్రామము, సిద్దిపేట అర్బన్ మండలం, సిద్దిపేట జిల్లా తెలియజేయునది ఏమనగా సర్వే నం.956 దీని విస్తీర్ణము ఎ॥ 3-36 గుంటలు హుస్నాబాద్ గ్రామము మరియు మండలం, సిద్దిపేట జిల్లా గల దానిలో నా క్లయింటుకు అవిభాగ 4వ భాగము కలదు. నా క్లయింటు అయిన పూల బాలక్రిష్ణారెడ్డి గారు O.S.No.180/21 గౌ॥ జూనియర్ సివిల్ జడ్జ్ హుస్నాబాద్ కోర్టులో విభాగం కోసం దావా వేసి యుండిరి. ఇట్టి దావాలో నా క్లయింటు I.A.No.314/21 & 315/21 ద్వారా అట్టి దావాలో గల 18 మంది ప్రతివాదులపై పై ఆస్తిని అమ్మకుండా మరియు ఎలాంటి నిర్మాణాలు చేయకుండా పిటిషన్ వేసి యుండిరి. అట్టి పిటిషన్లను గౌ॥ సిద్దిపేట Ist Addl. dist. Judge గారు I.A. No. 213/22 & I.A. No.214/22, CMA No. 69 మరియు 70 లలో విచారణకు తీసుకొని ప్రతివాదులైన 18 మందిని నిర్మాణాలు జరుపుటకు ఆపి యుండిరి. అదేవిధంగా ప్రతివాదులను పై ఆస్తిలో ఎట్టి క్రయ విక్రయాలు మరియు ఎలాంటి నిర్మాణాలు జరుపకుండా గౌ॥ కోర్టు వారు తేది: 01-06-2023 నాడు ఆర్డర్ ఇచ్చి యుండిరి. కావున ఎవరైనా ఇట్టి గౌ॥ కోర్టు ఆర్డర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి నిర్మాణాలు చేసినా మరియు చేయుచున్న నిర్మాణాలను ఆపకపోయినచో మరియు ఎలాంటి క్రయ విక్రయం చేసినచో గౌ॥ కోర్టు ధిక్కారం క్రింద శిక్షార్హులు అవుదురని ఈ హెచ్చరిక ప్రకటన ద్వారా తెలియజేయనైనది.

ఇట్లు
S. RAMESHWAR RAO
Advocate B.Sc, L.L.B.
H.No.11-4-69/3, Bharathnagar,
Siddipet Town & Dist. Cell: 9396423231

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించినప్పుడే ఉన్నత స్థానానికి చేరుకుంటారని దేశ్‌పాండే ఫౌండేషన్ క్లస్టర్ ట్రైనర్ లావణ్య అన్నారు. బుధవారం పాలమాకుల ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్కిల్ ఇన్ ఇంగ్లిష్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. దేశ్‌పాండే సంస్థ కర్ణాటకలో చేపట్టిన స్కిల్ ఇన్ విలేజ్ కార్యక్రమం ప్రవేశపెట్టి మంచి ఫలితాలు సాధించిందన్నారు. దీంతో తెలంగాణలోని సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమారస్వామి, సారయ్య, పరమేశ్వర్, హెచ్‌ఎం ప్రభాకర్, రాములు, యాదగిరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

హుస్నాబాద్: పోస్టల్ ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో సూచించారు. ఏడాదికి రూ.399తో టాటా, 396తో బజాజ్ బీమా తీసుకుంటే ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి రూ.10లక్షలు అందజేస్తామన్నారు. ఈ నెల 30వ తేదీవరకు ప్రతి పోస్ట్ ఆఫీస్‌లో ప్రత్యేక శిబిరాల ద్వారా బీమా చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలని ఆయన తెలిపారు.

◆ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హుస్నాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు హుస్నాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జూలై 6 నుంచి జరిగే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు దుర్గయ్య, సమ్మయ్య, శ్రీకాంత్, లక్ష్మణ్, కనకయ్య, బాబు, కొమురయ్య, రాజవ్వ, నర్సవ్వ, పద్మ పాల్గొన్నారు.

◆ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ అసెంబ్లీ కోకన్వీనర్ బండారు మహేశ్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌ను సందర్శించిన సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మధుసూదన్, నాయకులు పాల్గొన్నారు.

◆ రైతులకు మెరుగైన సేవలందించాలి

గజ్వేల్‌రూరల్: రైతులకు మెరుగైన సేవలందించి వారి ఆర్థికాభివృద్ధి చొరవ చూపాలని కొండపోచమ్మ దేవస్థాన కమిటీ డైరెక్టర్, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోలి సంతోష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎదురుగా ఉన్న జయహో కిసాన్ అగ్రిటెక్ షాపులో బుధవారం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటి బహుమతికి ఎంపికైన గజ్వేల్ మండలం గిరిపల్లికి చెందిన రైతు సాయిలుకు నిర్వాహకులు దామోదర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, శ్యామ్, సాయిరెడ్డి, రవిలతో కలిసి ద్విచక్ర వాహనాన్ని అందజేశారు.

◆ ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని వారికి దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు సహకారంతో లైసెన్స్‌లు ఉచితంగా అందిస్తున్నామని కొండాపూర్ ఉపసర్పంచ్, బీజేపీ మండల కార్యదర్శి జిగిరి అమర్ తెలిపారు. బుధవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాల వయస్సు నిండి డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు దరఖాస్తులను దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ నెల 29 నుంచి జూలై 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందించాలని కోరారు. లైసెన్స్‌లు లేని వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

గజ్వేల్‌రూరల్: విద్యారంగంపై బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వేణు మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ దళితబంధు పేదలకు వరం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని ఆరెపల్లి గ్రామంలో వేల్పుల లక్ష్మణ్ విజయలక్ష్మికి మొదటి విడతలో మంజూరైన దళితబంధు యూనిట్‌ను బుధవారం ఎంపీపీ కీర్తిసురేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.